కథా నిలయం
5894
శ్రీకాకుళం

# నానమ్మ

అన్నయ్య ఉత్తరం... నానమ్మ సంవత్సరీకం - తప్పక రావాలని...

నానమ్మ పోయి అపుడే ఎనిమిది నెలలవుతోందా... ఇంకా కళ్ళముందు ఉన్నట్టే ఉంది... నానమ్మ నిజంగా పోయిందా.. నాలో లేదూ... నాలో సగం నానమ్మే. మిగతా సగం అమ్మ. అమ్మ నానమ్మ కలిపితే నేను... వాళ్ళిద్దరు కాకుండా నాలో నాదంటూ వ్యక్తిత్వం వేరే ఉందా... ఏమో... ఆ విషయం తెలిసిన వాళ్ళు చెప్పాలి.

నాపై నాన్న ముద్రా తాత ముద్రా తక్కువ. నా పై అమ్మకన్నా నానమ్మ ముద్ర ఎక్కువ. నా పెంపకం అలా జరిగింది. నన్ను నా స్నేహితురాళ్ళు అచ్చం నానమ్మల్లా మాట్లాడతవేమే అని వెక్కిరించేవాళ్ళు. నాకామాట కోపం తెప్పించే బదులు ఎంత సంతోషాన్నిచ్చేదో. నానమ్మలా ఎంతో పెద్దయిపోయినట్టు... ఎంతో తెల్సి పోయినట్టు...

నేను పుట్టకముందే నానమ్మ పుట్టిందట. నాన్న పుట్టక ముందే నానమ్మ పుట్టిందట. చిన్న నానమ్మకన్నా పదేళ్ళముందే పుట్టిందట. నీ వయసెంత నానమ్మా అంటే యిలాంటి కథలు చెప్తుంది నానమ్మ.

నిజంగా నానమ్మలకు అమ్మమ్మలకు వయస్సుంటుందా! దేవతలకు వయస్సుంటుందా. వాళ్ళు ఎపుడూ ఒకేలా కనపడతారు. మనం ఎలా చూస్తే అలా కనబడతారు. ఎన్నేళ్ళయినా ఎన్ని తరాలు మారినా... చనిపోయినా... నానమ్మలూ దేవతలూ ఒకేలా కనబడతారేమో.

అమ్మలకూ నానమ్మలకూ వయసుండదు. వాళ్ళ దగ్గర ఏ వయస్సులో నైనా పసిపిల్లల్లా గారాబం చేయవచ్చు. నవ్వుతూ ఏడుస్తూ సతాయించుకుంటూ వాళ్ళ కొంగు పట్టుకు తిరగడానికి వయస్సు అడ్డంరాదు. నన్నెపుడూ చిన్నపిల్లని చేసిపడేసే శక్తి నానమ్మకెలా అబ్బిందో...

నేను పదో తరగతిలో ఉన్నపుడు మాత్రం నానమ్మ నన్ను "చిన్నపిల్ల... అమాయకురాలు ఎలా బతుకుతుందో"! అన్నట్టు చూస్తుంటే ఉక్రోశం వచ్చేది. పది చదువుతున్న నేనింకా చిన్నపిల్లనేనా అని రోషంగా చూసేదాన్ని. అదెంతో కాలం లేదు. నాలుగైదేళ్ళు పోయాక నానమ్మ ముందు నేను మళ్ళీ చిన్నపిల్లనై పోయాను. అప్పట్నించిక ఎపుడూ నానమ్మకు నేను చిన్నపిల్లనే. ఎవరో ఒకర్తో నేను చిన్నపిల్లనే అని అన్పించుకోవాలని ప్రతి ప్రాణీ కోరుకుంటుందేమో. అది జీవితానికి తిరిగి స్వచ్ఛంగా పసితనాన్నిస్తుంది.

నానమ్మకు నేనంటే ఎంత యిష్టమో... చిన్నప్పుడు నానమ్మ అచ్చం నాలాగే ఉండేదట. "మా అవ్వవే నువ్వు... నన్ను లాలించిన అవ్వవే... మా అవ్వనే మల్లా నువ్వై పుట్టినవే..." అంటూ నన్ను ఎత్తుకొని ఆడించేది నానమ్మ.

మరోసారి అన్నయ్య ఉత్తరం చదివాను. అన్నయ్య నాకిచ్చిన సంజాయిషీ... మళ్ళీ చదవాలనిపించింది.

ప్రియమైన ద్యావనపెల్లి గంగాధర్ బావగారికి,

పదివేల నమస్కారములతో మీ బావమరిది లక్ష్మిరాజం రాయునది, చెల్లె యిక్కడ పదిరోజులుండేటట్లు తప్పక పంపగలరని కోరుతున్నాను. నానమ్మ సంవత్సరీకం రోజున మీరందరు రావాలని మరిమరి ప్రార్థిస్తున్నాను. అందరికీ నమస్కారాలు తెలుపగలరు. సుగుణా- తప్పక వెంటనే బయలుదేరగలవు.

సుగుణా! ఇలా ఇంత తొందరగా సంవత్సరీకం చేస్తున్నందుకు నువ్వు తప్పు తీయవద్దని కోరుతున్నాను. నానమ్మకు అయిదు రోజులల్ల పదకొండు రోజుల పెద్దకర్మ చేసినపుడు నానమ్మ మీద గింత ప్రేమలేదా... అయిదు రోజులకే చేస్తరా పెద్దకర్మ. గట్ల చేస్తే నానమ్మ ఎపుడు చస్తదని మీరు ఎదురు చూసిన్రేమో అని అనుమానం వస్తున్నదని ఏడ్చి లొల్లిచేస్తివి. నీ మేనకోడలు పెళ్ళి ముహూర్తం కోసం ఇలా సర్దుబాటు చేయాల్సి వచ్చింది. ఇపుడు వచ్చే ముహూర్తాలు తప్పితే మల్ల ఉగాది తర్వాత నేనట.

పెండ్లి పిల్లగానికి వందుకునుడు తిప్పలైతున్నట్టుంది. పెండ్లికి ఎగిర్త పడుతున్నడు. వేరే సంబంధాలు యింతకన్న ఎక్వ కట్నం యిస్తమని వస్తున్నరు. సుగుణా! ఆడపిల్ల తండ్రిగా నా ఆవేదనను అర్థం చేసికోగలవని కోరుతున్నాను. నువ్వు పదిరోజులు ఇక్కడ ఉండేటట్టు వెంటనే బయలుదేరి రాగలవు. నానమ్మకు తాత సమాధి పక్కనే సమాధి కడ్తామనుకుంటిమి. ఎక్కడోళ్లం అక్కడనే ఉంటిమి. మల్ల కలువకపోయిరి. నువ్వు వచ్చినంకనే అన్నీ మాట్లాడుదాము. నువ్వు కోరినట్టు తాత సమాధి పక్కన నానమ్మ సమాధి కట్టాలంటే నువ్వు పదిరోజులు యిక్కడే ఉండి నువ్వే కట్టించాలి.

ఇట్లు

మీ అన్న-లక్ష్మిరాజం

ఉత్తరం చూసిన్నించి నాకు కాలునిలువడం లేదు. ఎప్పుడు తల్లిగారింటికి పోదామా అని ధ్యాస మళ్ళింది. ఉత్తరాన్ని మేనకోడలు సుజాతే రాసినట్టుంది. ఇది దాని రాతే... పిల్లగానికన్న మంచి పెండ్లి సంబంధం ఎత్తిపోతదని దీనికే తొందరున్నట్టున్నది. ఎంతో కుదురుగ రాసింది... నానమ్మ పోయి అపుడే ఎనిమిది నెలలవుతోందా!

బస్సు ఎంత వేగంగా పోతున్నా కదులుతున్నట్టే అన్పించడం లేదు. నా ఆలోచనల వేగాన్ని బస్సు ఎలా అందుకోగలదు!

నాన్నపోంగనే అమ్మ బతుకు ఎట్లయిపోయింది. ఒక నెల ఆ అన్నయింట్ల, ఒక నెల ఈ అన్నయింట్ల. ఓ నెల తమ్ముని యింట్ల. ఇదేం తిరుగుడు నెలకోసారి. వాళ్ల ఉద్యోగాలు యిట్లా నెలకో చోటికి బదిలీ చేస్తే వాళ్లకు ఎట్లా ఉంటుంది.

అన్నయ్యను నెలకోస్కూలులో పనిచేయమంటే ఎలా ఉంటుంది? నెలకో ఊరు తిరుగుడు అమ్మకు అట్లా ఉండదా... నానమ్మ పోయినాకైనా "యిక

ఎప్పటికి నా దగ్గర్నే ఉండే" అంటే అది వినది.

"బిడ్డ యింటికాడ ఉంటే లోకం ఏమనుకుంటదే... వద్దు" అని అంటది.

ఈసారి అమ్మను తప్పక ఇంటికి తీసుకురావాలె. నానమ్మకు సొంత కూతురిలా ఏళ్ళ తరబడి సేవలు చేసిన అమ్మకు యిప్పుడు విశ్రాంతి కావాలె.

అమ్మమ్మ నానమ్మ, తాత వంటి పెద్ద మనుషులు ఉంటే ఆ యిల్లు ఆ తీరే వేరు. పెద్ద మనుషులు యింట్లో ఉంటే యింటికి ముత్తయిదువ తనం వచ్చినట్టుంటది. ఇల్లు నిండుగ వుంటది. ఇల్లంతా పండుగ తీరుంటది. పెద్ద వాళ్లనుండి మనుమలు, మనుమరాళ్ళు ఎన్ని విషయాలు నేర్చుకుంటారో... పిల్లలు టి.వి. ధ్యాస్యలోపడి పాడయిపోతున్నారు. అమ్మను తప్పక తీసుకరావాలె. కమ్మని కథలెన్నో చెప్పించాలె.

నానమ్మ ఎన్ని కథలు చెప్పేది. ఎంత కష్టపడి పనిచేసేది. ఎన్ని పిడుకలు ఏరుకొచ్చేది. ఏ పనిమీద పోయినా పెండ కనపడితే అరిచేతుల్లోనైనా తెచ్చేది గాని వదిలేది కాదు.

నానమ్మ రాట్నం వడుకుతుంటే చూడాలె. రాట్నం ఆముదం కందెనతో మెత్తగా జుమ్మంటుండేది. దారం కండెగా కదురుకు చుట్టుకుంటూ వడుకుతున్న పోగు వెంటదారం ఏకు దాకా జుమ్మంటూ నాదం చేస్తుంటే ఎంత మధురంగా ఉండేదో.

రాట్నం వడుకుతుంటే వీపు మీంచి నానమ్మ మీద వేలాడి చూస్తూ ఉంటే... దారం వనుకుతున్నదే పోగు దొడ్డు వస్తున్నది. లెవ్వె పోరి అని ప్రేమగా విసుక్కుం టుంటే... నానమ్మ చెమట ఎంత కమ్మని వాసన.

నానమ్మ పద్దెంది మూళ్ళ చీరే గోసి పోసి పిరిసిట్టి కట్టుకట్టిందంటే దేవత లెక్క కనపడేది. నానమ్మ జాకెట్టు వేసుకొనేదికాదు. బటన్సులేని రవిక ముడి వేసుకునేది. నానమ్మ తెల్లవెంట్రుకలు వెండితీగల తీరు ఎంత ముద్దుగ ఉండేవో...

నానమ్మ రాట్నం వడుకుతుంటే ఓ ఫోటో తీసి గాంధీ తాత రాట్నం వడికే బొమ్మ పక్కన పెట్టాలనిపిస్తుండే. రాట్నం వడుకుతున్నపుడు గాంధీ తాత కన్నా నానమ్మరూపే ఎంతో బాగుంటుంది.

నానమ్మ వడికిన నూలుతోనే యాభయి ఏండ్లు మా యింట్లో దుప్పట్లన్నీ నేయించారట.

ఊరివాళ్ళకోసం నానమ్మ దుప్పట్లకని దొడ్డు నూలు వడుకుతుండేది. తూకంతో కండెలు యిచ్చి నేసినంక తూకం తోనే గంజి బరువుకలిసి లెక్కేసి దుప్పట్లు తీసుకొని కూలియిచ్చేవాళ్లట. ఖాదీ దుప్పటి రెండు పొరలు కుట్టించి కప్పుకుంటే ఉతుకుటానికి చాకలి ముసలమ్మ గులిగేది. అంత బరువుండేది.

తన కాల్లగోల్ల (శోభనం)కు నానమ్మ ఎంతో కష్టపడి మంచి పత్తి తెప్పించి ఏకులు చేయించి నూలు వడికి దుప్పటి నేయించి యిచ్చింది. చలికాలం ఆ దుప్పటి వెచ్చగ కప్పుకుంటే ఈయన "ఛీ గంజి వాసన." అని తీసిపారేస్తుంటే నా మనస్సు ఎంత కలుక్కుమన్నదో. పుల్లని గంజివాసనలో పుట్టి గంజి వాసనలో పనిచేసే శాలోల్లకు గంజి గంజి వాసనవస్తుందా! ఆ వాసనచూస్తే ప్రాణం లేచి వచ్చినట్టు ఉంటుంది.

శాలోల్ల యిండ్లల్ల పుల్లని గంజి వాసన, తడిపిన నూలు వాసన ఎంతో కమ్మగా ఉండేవి. ఆ నూలు, ఆ రంగులు, గంజి, అన్నీ కలిపి అదోరకం కమ్మని వాసన వచ్చేది. ఆ వాసనరాని యిల్లు శాలోల్ల యిల్లంటే నమ్మబుద్ధి అయ్యేదికాదు.

"బొంబాయిల సాంచాలు (మిల్లులు) అంటూ తేలినంక శాలోల్లందరి బతుకు ఆగం అయిపోయిందే". అని నానమ్మ అంటుండేది. " వద్దనంగ పెద్దనాన్న బొంబాయి బోయి ఏంబావుకున్నడే" అని ఎప్పుడూ బాధపడుతుండేది. పెద్దనాన్న పిల్లల్ని చూడాలని నానమ్మకు ఎంతో ఆరాటం. పెద్దనాన్న బొంబాయికి తీసుకు వెళ్ళేవాడుకాదు. వాళ్లు ఇక్కడికి వచ్చేవాళ్ళుకాదు ఎప్పుడో చుక్కతెగిపడ్డట్టు తప్ప. ఈసారయినా వస్తారోలేదో.

నాన్న సాదామొగ్గాలతో పోటీ పడలేక సట్టర్ మొగ్గాలు చేయించిండు. బట్టమీద డిజైన్లు రావడానికి ఎన్నో ఉపాయాలు చేసి పింజర కనుక్కున్నారు. నాన్న నేస్తున్నపుడు పైన పింజర తిరుగుతుంటే కింద బట్టమీద నూలు పోగులు జరుగుతూ డిజైనుగా మారుతుంటే చూసిన కొద్దీ చూడబుద్దయ్యేది.

తాత ఓసారి నానమ్మను ఏమాయెనే కండెలు అందియ్యవూ అని పంటెతోని కొట్టిండట. నానమ్మ పిల్లల్ని సగవెట్టుకుంట అలికి వంట చేసుకుంట కండెలు వడుకాలె. వీపుల దెబ్బదాకి "నీ యింట్ల పీనుగెల్ల ఆడ్సిపడ్తల(అకస్మాత్తుగా) ఎంత దెబ్బగొడ్తివి" అని అదే పంటె(నూలుచుట్టేది) దీస్కొని తాతను రెండు ఈడ్చి కొట్టిందట. ఇక అప్పట్నించి తాతది మాట బెదురే తప్ప చెయ్యి లేపలేదట.

"ఈ మొగోల్లు ఉత్తపనిదొంగలే. పని మనది పేరు వాళ్ళది. పడుగు

పోసుడు, గంజి తెచ్చుడు, కండెలు చుట్టుడు, వంట చేసుడు, పోరగాన్లను సవరిచ్చుడు అన్ని చేసుకుంట మల్ల మొగ్గంనేయాలె. అంచునెయ్యాలె ఆడోల్లు. మొగోల్లు ఏమున్నదే పడుగు సరిచేసి నేసి అమ్ముకచ్చుడు. గంతే అమ్ముకరాను పోయి రాంగరాంగ తాల్లల్ల కల్లు దాగి అంత మందం ధర తక్కువకు అమ్మిందని అబద్ధాలాడుతరు."

"ఈ సంసారం ఒక్క తీరు చేస్తే పురి కట్టిందానే! మనకు పొలాలు లేకపాయె, పెరండ్లు లేకపోయె. ఇత్తులు ఏది కొన్నా ధరలు అగ్గిమండె. కూలికి పోయి ఇత్తులు తెస్తుంటి. మక్క గట్క అందరు తింటె నాకు అది గూడ దొరకక పోవు. గంజిల ఉప్పురవ్వ ఏసుకుని తాగి పంటే ఆకలికి రాత్రికి పేగులు కడుపు నొప్పితోటి వడి తిరుగుతుండె."

"బట్టనేత అంటే ఆడిసేత లేనిది అసలే కాదే. ఇంట్ల ఆడిది పోతే కుల కశిపి పోయినట్టేనే. ఆ యిల్లు యిల్లు గాదు. గాడిదలు పొర్లినట్టుంటది. పోరగాన్లు దుబ్బల పొర్లినట్టుంటరు."

నానమ్మ ఇలా ఎన్ని చెప్పేదో... నానమ్మ నడుస్తున్న జీవిత చరిత్ర తీరుండేది.

---

బస్సు దిగి అన్నయ్య ఇంటికి చేరే తోవలో ఓ గుంపు నిశ్శబ్దంగా వుంది. మళ్ళీ ఎవరో ఉరి వేసుకొని చనిపోలేదు గదా అని మనస్సు బాధతో నిండి పోయింది.

దగ్గరిచుట్టాలే వాళ్ళు. దగ్గరగా వెళ్ళిచూసేసరికి సన్నగా మాటలు వినపడుతున్నాయి.

ఎదిగిన కూతురు ఎవరితోనో లేచిపోయింది "పెళ్ళి చేయలేదని నాన్నా బాధపడకు– మా బాధలేవో మేం పడుతాము." అని ఉత్తరం రాసిపెట్టిపోయిందట.

నానమ్మ, గాంధీ తాత ఇద్దరూ కళ్ళల్లో మెదిలారు. ఇలాంటి చేనేత బతుకులు చూడకుండా ముందేవెళ్ళిపోయిన మీరెంత అదృష్టవంతులు.

"గాంధీ తాతా! రాట్నాన్ని జాతి చిహ్నంగా జెండానెక్కించావు. మా బతుకులకేమిచ్చావు ఆధారం" అంటూ మనస్సు మూగగా ప్రశ్నించింది.

"సుగుణక్కా" అంటూ మేనకోడలు సుజాత పరుగున ఎదురొచ్చింది చూడలేదు. దాని మొహంలో పెళ్ళికళ. దాని మొహంలో నానమ్మే కనపడింది. మళ్ళీ పుట్టిన నానమ్మ నాదేవత. ఎనిమిదినెల్లలోనే ఎంత ఎదిగింది. దేవకన్య పోలెఎదురొచ్చింది. దీని పెండ్లికోసం పెండ్లి నగలేమి చేయించుకొని రాకపోతినని మనస్సు విలవిలలాడింది.

అన్నయ్య ఉత్తరం వచ్చిన్నుంచి ఎప్పుడూ నాగురించే తప్ప దాని గురించి ఎందుకు ఆలోచన రాలేదో ఆశ్చర్యం... మళ్ళీ పుట్టిన నానమ్మకి ఏదైనా పెళ్ళికి చేయించాలి.

నా చేతిలోని సూటుకేసు తీసుకొని సుజాత ఇంటికేసి దారి తీసింది.

**ఆదివారం ఆంధ్రజ్యోతి**